ప్రజాశక్తి

శుక్రవారం 27 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గ్రీన్ అంబాసిడర్లకు

అందని వేతనాలు

పంచాయతీలకు ఆదాయం సమకూరుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

పరిసరాలను శుభ్రపరుస్తున్న గ్రీన్ అంబాసిడర్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పల్లెలను పరిశుభ్రంగా ఉంచి, చెత్త నుంచి ఎరువు తయారుచేసి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్న గ్రీన్ అంబాసిడర్లు జీతాలు అందక బాధపడుతున్నారు. వీరిపట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. గ్రామాల్లో తడి, పొడి చెత్తతో పాటు గాజు పెంకులు, ప్లాస్టిక్‌ను వేరుచేసి వాటిని వేర్వేరు తొట్టెల్లో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రీయ ఎరువు తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు గ్రీన్ అంబాసిడర్లు ఆదాయం సమకూరుస్తున్నారు. జిల్లాలో ఈ తరహా పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు 1669 మంది వుండగా, షెడ్డు కాపలాదారులు 485 మంది వున్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఆరు వేల రూపాయల వేతనాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేతనం గతంలో కేంద్ర ప్రభుత్వం చెల్లించేది. రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చడంతో కేంద్ర ప్రభుత్వం వీరికి చెల్లించాల్సిన వేతనాలు నిలిపివేసింది. అప్పటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు సమస్యలు మొదలయ్యాయి. ప్రతి నెలా జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు వుండడంతో ఏ నెలా ఆరు వేల వేతనం చెల్లించడంలేదు. ఏడాది మిగతా 2లో..

రూ.15 వేలు వేతనం చెల్లించాలి

ఆసుపత్రి, మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు నెలకు రూ.15 వేలు వేతనాన్ని ప్రతి నెలా చెల్లించాలి. టెండర్ల పద్ధతిని రద్దు చేసి నేరుగా వేతనాలు ఇవ్వాలి. చెత్త సేకరణ, ఎరువులు తయారు చేస్తున్న వీరికి రక్షణ పరికరాలు అందించాలి. పనిముట్లు సరఫరా చేయాలి.

ఆర్.శంకరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ఉప రాష్ట్రపతి పర్యటనకు

పకడ్బందీ ఏర్పాట్లు

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచనలు చేశారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నట్టు వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆంధ్ర వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించే శత వసంతాల వేడుకకు ఉప రాష్ట్రపతి హాజరవుతున్నారని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమ నిర్వహణకు అన్ని విభాగాల అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. 28వ తేదీ ఉదయం విశాఖపట్నం చేరుకున్నప్పటి నుంచి కార్యక్రమం ముగిసి ఆయన తిరుగు మిగతా 2లో..

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

▶ వార్త మెయిన్‌లో..

10 నుండి చెకుముకి సైన్స్ సంబరాలు

▶ వార్త 8లో..

పలు రైళ్లు రద్దు, గమ్యస్థానాల మార్పు

▶ వార్త 2లో..

బ్లాస్ట్ ఫర్నేస్ - 2 వద్ద స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్, ఉక్కు అధికారులు

బ్లాస్ట్ ఫర్నేస్ -2లో రికార్డు స్థాయి ఉత్పత్తి

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం బ్లాస్ట్ ఫర్నేస్ - 2లో మరో రికార్డు నమోదైంది. 'ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ బ్లాస్ట్ ఫర్నేస్ - 2 (కృష్ణ)లో 50 మిలియన్ టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి సాధించటం చారిత్రాత్మకమైన మైలురాయి' అని స్టీల్ ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ అన్నారు. ఈ క్రమంలోనే గురువారం బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలోని కంట్రోల్ రూమ్‌లో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ మిగతా 2లో..

అసమానతలు లేని

అభివృద్ధి కోసం ప్రజా ప్రణాళిక

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక రూపొందించిందని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం వెల్లడించారు. సిపిఎం ఆధ్వర్యాన రూపొందించిన ప్రజా ప్రణాళికను గురువారం అనకాపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్నలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 15న ప్రజారక్షణ భేరి పేరిట విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మందస నుంచి నవంబర్ 2న ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 5న జిల్లాలో పర్యటిస్తుందని చెప్పారు. విభజన హామీలను అమలు చేయాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏ

ప్రజా ప్రణాళికను ఆవిష్కరిస్తున్న లోకనాథం, తదితరులు

ఒక్కదాన్నీ అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని మండిపడ్డారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన బిజెపి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అందని వేతనాలు

నుంచి కొన్ని పంచాయతీలు ఆరు వేల రూపాయల వేతనానికిగానూ మూడు వేల రూపాయలే చెల్లిస్తున్నాయి. కొన్ని పంచాయతీలు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, ఇతర వాటికి మళ్లించడంతో పంచాయతీలు వేతనాలను వీరికి చెల్లించలేకపోతున్నాయి. గతంలో మూడు నెలలకు ఒకసారైనా వేతనాలు అందేవి. ఇప్పుడు నెలలు గడుస్తున్నా పూర్తి వేతనాలు ఇవ్వడంలేదు. పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలకు లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం ఖర్చు పెట్టింది. చెత్తతో తయారుచేసిన సేంద్రియ ఎరువుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని ప్రభుత్వాలు గొప్పగా చెప్పాయి. కానీ ఆచరణలో ఆ సంపద సృష్టించే అంబాసిడర్లు జీతాలకు నోచుకోక అవస్థలు పడుతున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

పయనమయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉంచుకోవాలని డిఎం అండ్ హెచ్‌ఒను ఆదేశించారు. ఎయు కన్వెన్షన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో కార్యక్రమాలు జరిగే క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నేవీ అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జివిఎంసి పరిధిలో సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పోర్టు రోడ్డులో దుమ్ము ధూళి లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గార్డు ఆఫ్ ఆనర్ ఇతర సంప్రదాయక కార్యక్రమాల నిర్వహణలో నేవీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమీక్షా సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఇండియన్ నేవీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్ మల్లికార్జున పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్‌తో కలిసి గురువారం సాయంత్రం ఎఎస్ఎల్ నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా ఐఎన్ఎస్ డేగాలో ఉప రాష్ట్రపతికి రిసెప్షన్, పర్యటన ఏర్పాట్లు విషయమై నేవీ అధికారులతో చర్చించారు. తదుపరి ఎఎంసికి చేరుకొని అక్కడ పైలాన్, ప్లాంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్, ఫొటో సెషన్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. తదుపరి ఎయు కన్వెన్షన్ సెంటరులో ఎఎంసి శతాబ్ది వేడుకల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆవరణలోగల ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాలను జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట నాలుగో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎఎంఒహెచ్ డాక్టర్ రాజేష్, డిఇఇ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

అభివృద్ధి కోసం ప్రజా ప్రణాళిక

అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి కుట్రలు చేస్తోందన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందని గుర్తుచేశారు. బిజెపి బుల్‌డోజర్ రాజకీయాలతో అన్నదమ్ముల్లా సమైక్యంగా మెలగవలసిన ప్రజల మధ్య విద్వేషాలు రగులుతున్నాయన్నారు. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను మోడీ సర్కారు విస్మరించిందన్నారు. తాను కూడా ఏమాత్రమూ తీసిపోనంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని లోకనాథం మండిపడ్డారు. కృష్ణపట్నం, గంగవరం మేజర్ పోర్టులతో పాటు రాష్ట్ర ప్రజల సంపదను ఒక్కొక్కటిగా అదానీకి నైవేద్యంగా అప్పగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట కూడా అనడంలేదన్నారు. కేంద్రం చెప్పినట్లల్లా తలాడిస్తూ ప్రజలమీద మోయలేని భారాలను వడ్డిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెనుభారం ప్రజలపై రుద్దుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు, మోటార్లకు మీటర్లు పేరుతో, ఆస్తి పన్ను నుంచి చెత్త పన్ను దాకా అన్ని వడ్డింపులతో ప్రజలపై భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. ఆయా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయడానికి సిపిఎం ప్రజా రక్షణ భేరి మోగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

బ్లాస్ట్ ఫర్నేస్ -2లో రికార్డు స్థాయి ఉత్పత్తి

కార్మిక వర్గం యావత్తు కృషి ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. భవిష్యత్తులోనూ ఇలాగే అకుంఠిత దీక్షతో పనిచేసి మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎకె.బగ్చి, సిజిఎం వర్క్స్ ఆర్.మహంతి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి క్రికెట్ జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పూల్ - సి మ్యాచ్‌లో మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. విడిసిఎ-బి మైదానంలో జివిఎంసి, ఎంఎవి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జివిఎంసి జట్టు 5 వికెట్ల తేడాతో గెలిచింది. మొదటగా బ్యాటింగ్ చేసిన ఎంఎవి జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 138 పరుగులు చేసింది. బదులుగా జివిఎంసి జట్టు 15.2 ఓవర్లలో 140 పరుగులు సాధించి లక్ష్యాన్ని అందుకుంది. జివిఎంసి తరఫున రామ్ సతీష్ 21, జి.శ్రీను 46 పరుగులు సాధించారు. జట్టును జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

పలు రైళ్లు రద్దు, గమ్యస్థానాల మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా 07466 రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను అక్టోబర్ 27 నుంచి 29 వరకు, 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 27, 28 తేదీల్లో రద్దు చేశారు. అదేవిధంగా 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు కోరాపుట్‌లో షార్ట్ టర్మినేట్ చేయబడింది. దీంతో ఆ రైలు అక్టోబర్ 27 నుంచి 29 వరకు 18513 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి విశాఖపట్నానికి తిరిగి వస్తుంది. 18005 హౌరా - జగదల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు టిట్లాగఢ్ వద్ద షార్ట్ టర్మినేట్ చేయబడింది. ఈ నేపథ్యంలో 18006 జగదల్‌పూర్ - హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ 27 నుంచి 29 వరకు టిట్లాగఢ్ నుంచి హౌరాకు వెళ్తుంది. 18447 భువనేశ్వర్ - జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 26 నుంచి 28 వరకు కోరాపుట్ వద్ద షార్ట్ టర్మినేట్ చేయబడింది.

దీంతో 18448 జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి భువనేశ్వర్‌కు తిరిగి వస్తుంది. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గంటా పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ఉదయం టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు బోగస్ అని వైసిపి ఆరోపించటం నిజం కాదని నిరూపించేందుకు పలుమార్లు ఎయులోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు వెళ్లేందుకు గంటా ప్రయత్నించగా చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో ఎప్పటికప్పుడు ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా టిడిపి ఎమ్మెల్యేలతో కలిసి గంటా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎయులో వున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చూస్తే బాధ కలుగుతోందన్నారు. డంపింగ్ యార్డ్‌లా మార్చేశారని తెలిపారు. రాజకీయ కక్షతోనే ఈ సెంటర్‌ను ఇలా తయారు చేశారన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి గంటా, టిడిపి నేతలు

చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ఈ సంఘటనపై ఆంధ్ర యూనివర్సిటీలోని అధికారులు స్పందిస్తూ బయట వ్యక్తులు గుంపులు గుంపులుగా సెంటర్‌కు రావడాన్ని ఖండించారు. ఈ పద్ధతి సరైంది కాదన్నారు.

వాటాల కోసమే స్టాండింగ్ కమిటీ సమావేశాలు

మాట్లాడుతున్న టిడిపి, జనసేన కార్పొరేటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాటాల కోసమే స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారని టిడిపి, జనసేన కార్పొరేటర్లు ఆరోపించారు. జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో పలువురు కార్పొరేటర్లు గురువారం సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్‌గా ఉన్న పీలా శ్రీనివాసరావు మాట్లాడారు. చాలా అంశాలను చర్చ లేకుండా స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. వైసిపి కార్పొరేటర్లు సైతం ఈ అవినీతిపై ప్రశ్నిస్తున్నారన్నారు. ఎడిసి శ్రీనివాస్ రూ.15 లక్షల నిధులను అక్రమంగా డ్రా చేసినా చర్య తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ వేసవి శిబిరాలు అంటూ ఏకంగా రూ. 1.46 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. వాటికి లెక్కాపత్రం లేవన్నారు. సమావేశంలో టిడిపి కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

టిడిపిపై కుట్రలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి, తెలుగుదేశం పార్టీని లేకుండా చేయాలని వైసిపి నాయకులు చూస్తున్నారని టిడిపి విజయనగరం జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టారన్నారు. ఆయన అరెస్టుపై రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సహా ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు, భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేష్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బాబుకు ఏదైనా అన్యాయం జరిగితే భువనేశ్వరి రాకూడదా ? అని ప్రశ్నించారు. జగన్ జైలుకు వెళ్లినప్పుడు విజయమ్మ, షర్మిల, భారతి రోడ్లు మీదకు రాలేదా ? అని అడిగారు. అవినీతిపై బొత్స మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వోక్స్ వ్యాగన్ రాష్ట్రం నుంచి బొత్స కారణంగానే వెళ్లిపోయిందన్నారు. విజయనగరంలో మద్యం ఏరులై పారుతోందని, అంతా బొత్స చలవ కాదా అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో బొత్స చేసిన భారీ కుంభకోణం అందరికీ తెలిసిందేనని విమర్శించారు. ప్రజల మధ్యలోకి వెళ్లలేక వైసిపి నేతలు బస్సు యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు నవంబర్ 8కి వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు తెలిపారు. గురువారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM
E.P.66/2023 in O.S.21/2023

Between:
Sri Balla Veera Venkata Appa Rao ...D.Hr/Plaintiff
And:
Sri Gurugubelli Ramakrishna ...J.Dr/Defendant

NOTICE

To,
JDR: Sri Gurugubelli Ramakrishna,
S/o. Late Gurugubelli Simhachalam, Hindu,
aged 35 years, R/at. Flat No.202, D.No.7-42-6/1, First Floor, KBR Heights, Sivalayam Veedhi, Sangivalasa, Chittivalasa Post, Visakhapatnam District.

Please take notice that the above named D.Hr/Plaintiff filed the above E.P.66/2023 in the above court matter stands posted to **07-11-2023** for your appearance. You are hereby required to appear before the above Hon'ble Court either in person or through your Advocate on the above said date at **10:30 A.M.,** failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By Order of the Hon'ble Court)
M. KRISHNA,
Advocate
#2-28, Rajiv Nagar,
Old Dairy Farm Post,
Visakhapatnam,

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM
E.P.65/2023 in O.S.22/2023

Between :
Sri Avula Maridayya ...D.Hr/Plaintiff
And:
Sri Gurugubelli Ramakrishna ...J.Dr/Defendant

NOTICE

To,
JDR: Sri Gurugubelli Ramakrishna,
S/o. Late Gurugubelli Simhachalam, Hindu,
aged 35 years, R/at. Flat No.202, D.No.7-42-6/1, First Floor, KBR Heights, Sivalayam Veedhi, Sangivalasa, Chittivalasa Post, Visakhapatnam District.

Please take notice that the above named D.Hr/Plaintiff filed the above E.P.65/2023 in the above court matter stands posted to **07-11-2023** for your appearance. You are hereby required to appear before the above Hon'ble Court either in person or through your Advocate on the above said date at **10:30 A.M.,** failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By Order of the Hon'ble Court)
M. KRISHNA,
Advocate
#2-28, Rajiv Nagar,
Old Dairy Farm Post,
Visakhapatnam,

పత్తా లేని 'ఆహార' తనిఖీలు..!

- నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటం
- నిషేధిత వస్తువుల అమ్మకాలపై కొరవడిన నిఘా

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న గాజువాకలో దాని తగ్గట్టుగానే విశాలమైన నియోజకవర్గంలో అదే స్థాయిలో జనసాంద్రత పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టుగా గాజువాకలో హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతరత్రా తినుబండారాలు, ఆహార పదార్థాలను అందించే సెంటర్లు కూడా విపరీతంగానే పెరిగాయి. ఇంతపెద్ద నియోజకవర్గంలో, విపరీతంగా పెరిగిపోతున్న హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలనకు గానీ, వాటి నిర్వహణపై నిఘాపెట్టే నాథులే లేరని, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జాడ కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

గాజువాకలో సుధ హోటల్ వెనుకన ఐదేళ్ల క్రితం జివిఎంసికి చెందిన కార్యాలయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం కూడా ఉండేది. అప్పట్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో ఉండి, నిరంతరం వీటిపై నిఘా పెట్టడంతోపాటు తనిఖీలు కూడా నిర్వహించే వారు. కానీ అక్కడున్న కార్యాలయాన్ని తొలగించడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్థానికంగా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. దీంతో హోటల్స్, ఫుడ్ సెంటర్లపై తనిఖీలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. ఫుడ్ సేఫ్టీ యాక్టు ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి శాంపిల్స్ సేకరించి వాటిని ల్యాబ్‌లకు పంపించాలని నిబంధన ఉన్నా, అవి అమలు జరగడం లేదు. దీంతో హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర ఆహారపదార్థాలను అమ్మే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, వాటిపై నిఘాపెట్టేవారు గానీ, పర్యవేక్షించే నాథులే లేకుండా పోయారని ఆరోపణలు ఉన్నాయి. నిల్వ ఉంచిన, కలుషిత ఆహార పదార్థాలను వినియోగదారులకు అంటగడుతూ వారి ప్రాణాలతో ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు ఆటలాడుకుంటున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. దీనికి నిదర్శంగా ఇటీవల పాత గాజువాక 60 అడుగుల రోడ్డులోన ఒక హోటల్‌లో ఉన్న ఫుడ్ పాయిజన్ జరగడం, కొందరు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన ఘటన చోటుచేసుకోవడంతో అధికారుల్లో కదలిక వచ్చి, ఆగమేఘాల మీద తనిఖీలు చేపట్టి, నాణ్యతలేని ఆహారపదార్థాలు ఉన్నాయని నిర్ధారణకు వచ్చి ఆ హోటల్‌ను మూసేశారు.అదే ఫుడ్ సేఫ్టీ అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండి, నిరంతరం తనిఖీలు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని పలువురు అంటున్నారు.

గాజువాకలో పలు హోటళ్లలో ఆహార పదార్థాల నాణ్యతపై నిఘా, పర్యవేక్షణ కొరవడిందని ఒకవైపు ఆరోపణలు ఉంటే, మరోవైపు నిషేధిత గుట్కాలు, పాన్‌పరాగ్‌లు వంటివి విచ్చలవిడిగా, పాన్‌షాపుల్లో బహిరంగంగా అమ్మకాలు సాగిస్తుంటే కనీసం కన్నెత్తి చూసే వారు కూడా లేరనే ఆరోపణలూ ఉన్నాయి. దీంతోపాటు పలు నిషేధిత మత్తుపదార్థాలు కూడా గాజువాక ప్రాంతంలో గుట్టుగా అమ్మకాలు సాగుతున్నాయని ఆరోపణలున్నాయి. తలసరి ఆదాయంలో నెంబర్ వన్‌గా ఉన్న గాజువాక ప్రాంతంలో ఆహారపదార్థాల నాణ్యతపై నియంత్రణ పర్యవేక్షణ పెంచడంతోపాటు, నిషేధిత వస్తువుల విక్రయాలను అరికట్టే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఫుడ్ సేఫ్టీ కార్యాలయాన్ని పునరుద్ధరించడమో, లేకుంటే నిరంతరం సంబంధిత అధికారుల తనిఖీలు చేపట్టడం ద్వారా ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం వివరణ కోరగా, ఫుడ్‌సేఫ్టీగా తరచూ తనిఖీలు కొనసాగుతున్నా యన్నారు. మూడుజిల్లాలకు సంబంధిత ఒక ప్రత్యేక బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ సోదాలు చేపడుతోం దన్నారు. ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పునరుద్ధరణపై సమాధానమివ్వలేదు.

నేరాలు ఘోరాలు

ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌కు ఏడాది జైలు

ప్రజాశక్తి -ఆనందపురం: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతికి కారకుడైన బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. ఐదువేలు జరిమానా విధిస్తూ భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటన్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారని స్థానిక పోలీసులు తెలిపారు. సిఐ రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం, 2019 జనవరిలో విజయనగరం నుంచి సింహాచలం వెళుతున్న బస్సు పద్మనాభం గ్రామానికి రాలి పైడమ్మ (60) ను అనే మహిళలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు సంఘటనాస్థలిలోనే మృతి చెందింది. దీనిపై అనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాలను కోర్టుకు సమర్పించగా, విచారణ అనంతరం ప్రమాదానికి కారకుడైన పెందుర్తికి చెందిన డ్రైవర్ కరక శ్రీనివాసరావుకు ఏడాది జైలుశిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారని సిఐ తెలిపారు.

డైట్‌లో ఖాదీ ఉత్సవం

ఖాదీ ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో గురువారం ఖాదీ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ మాట్లాడుతూ, దేశసంస్కృతిలో ఖాదీ భాగమని, భారతీయుల ఆచారాలకు, ఖాదీకి విడదీయరాని బంధం ఉందన్నారు. కారణాలేమైనా నేటితరం ఖాదీకి దూరం కావడం విచారకరమన్నారు. వైస్ ప్రిన్సిపల్ జి.రవి మాట్లాడుతూ ఖాదీ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. 'జాతి కోసం ఖాదీ, ఫ్యాషన్ కోసం ఖాదీ, ఖాదీ వస్త్రాలు ధరించాలి, ప్రోత్సహించాలి' అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు సోమయాజులు, త్రినాథరావు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11కెవి పెప్సీ ఫీడర్ మరమ్మతులు నేపథ్యంలో ఈనెల 27న శుక్రవారం 45వ సచివాలయం పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పిఎం.పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బాబానగర్, విజేత సూపర్ మార్కెట్, కార్‌షెడ్ ఏరియా తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సర్వే చేసి గ్రామ హద్దులు గుర్తించాలి

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం గ్రామ హద్దులను సర్వే చేయాలని గ్రామ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 29.25 ఎకరాల భూమిని ఇచ్చారని, అయితే ఆ భూమికి హద్దులు గుర్తించకపోవడ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై రీసర్వేచేసి, హద్దులను గుర్తించి, ప్రజలకు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని కోరారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చనను అర్చకులు కనులపండువగా నిర్వహించారు. భాండాగారంలో భద్రపరిచిన స్వర్ణ పుష్పాలను వెండి పళ్లెంలో ఉంచి, ఆలయ ఎఇఒ డి భ్రమరాంబ, ఆలయ సిబ్బంది మేళ తాళాలతో బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేయించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలకు స్వర్ణ పుష్పార్చన చేశారు.కార్యక్రమంలో పలువురు భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు

దళితుల హక్కులను పరిరక్షించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ములగాడ : దళితుల హక్కులను పరిరక్షించాలని ఎపి దళిత హక్కుల పోరాట సమితి నేతలు కోరారు. గురువారం 63వ వార్డు కాకరలోవలో డిహెచ్‌పిఎస్ విశాఖ జిల్లాశాఖ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రంలో ఉన్న దళిత సంఘాలన్నీ దీక్షలు చేపట్టి, పలు హక్కులను సాధించుకున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసిన 28 పథకాలను పునరుద్ధరించడంతోపాటు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను చట్టం చేసి, నవరత్నపథకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. నిరసనలో డిహెచ్‌పిఎస్ మల్కాపురం ఏరియా అధ్యక్షులు కామేశ్వరరావు, కమిటీ సభ్యులు కనకరాజు, బి.వెంకట్, గాలి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎయు విసి, తదితరులు

యోగా పోటీల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- విశాఖపట్నం : జిల్లా యోగా అసోసియేషన్, ఎయు యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు 2023 పోస్టర్‌ను గురువారం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.

ఎయు సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎయు యోగాకేంద్రం సంచాలకులు ఆచార్య ఒఎస్‌ఆర్‌యు భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కెఎ.రాజు, కార్యదర్శి సిహెచ్ వెంకట రమేష్, కోశాధికారి జి.రమణమూర్తి పాల్గొన్నారు.

నైపుణ్యాలున్న వారికే ఉద్యోగావకాశాలు

గీతం హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమల నిపుణులు

గీతం సదస్సులో పాల్గొన్న పరిశ్రమల నిపుణులు

ప్రజాశక్తి- మధురవాడ : కోవిడ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగం, ఉక్రెయిన్, రష్యా యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో వివిధ కంపెనీల నియామకపు ప్రక్రియలో గణనీయమైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా నైపుణ్యాలున్న వారికి మాత్రమే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని వివిధ పరిశ్రమల నిపుణులు అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన గీతం విసిప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ, పరిశ్రమలకు విద్యాలయాలతో మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులు చేయవచ్చునన్నారు. శాప్ ల్యాబ్స్ డైరక్టర్ కమల్ స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితులకు తగిన విధంగా తమను మలచుకోవవాలని, నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ఐబిఎమ్ లోకల్ హెడ్ ఎ.అనురాధ, కాగ్నిజెంట్ సీనియర్ డైరక్టర్ సి.సుబ్రహ్మణ్యం, ఇన్‌టెల్ బిజినెస్ మేనేజర్ హెచ్.గిరీష్, బ్రాండిక్స్ టేలంట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ షెహజాది, అమర్‌రాజా గ్రూప్ బిజినెస్ హెచ్‌ఆర్ రవికుమార్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ మేనేజర్ జాక్సన్ జాన్సన్, ఆల్‌స్టామ్ డైరక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్ధేశం చేశారు. ప్రొఫెసర్ సి.శాంతి, ప్రొఫెసర్ బి.రవికిషోర్ సంధానకర్తలుగా వ్యవహరించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, తాము చదివే కోర్సు పట్ల లోతైన అవగాహన, బృందాలుగా పనిచేసే సామర్థ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునే తత్వం అవసరమని పరిశ్రమల నిపుణులు సూచించారు.

ఎయులో అనధికార ప్రవేశం సరికాదు

విద్యార్థులకు ఇబ్బంది కలిగించారు : రిజిస్ట్రార్

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ప్రధానమంత్రి కౌశల్ యోజన కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు జరుగుతున్న సమయంలో కొంత మంది అనధికార వ్యక్తులు గుంపుగా ప్రవేశించినట్లు తన దృష్టికి వచ్చిందని, ఇది ఎంతమాత్రం సరికాదని ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సంబంధిత ప్రాంగణంలోకి విశ్వవిద్యాలయం నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా బయటి వ్యక్తుల ప్రవేశానికి అనుమతి లేదని నిర్దిష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ మూకుమ్మడిగా పదుల సంఖ్యలో రావడాన్ని తప్పుబట్టారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రారంభించి 98ఏళ్లు అయిందని, దశాబ్దాల కాలంగా వివిధ పరిశోధన ప్రాజెక్టులలో భాగంగా సమకూర్చుకున్న ప్రయోగ ఉపకరణాలను ఇక్కడ ఉంచడం, విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. ఎయులో స్కిల్ డెవలప్‌మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు.

ఇదొక పెద్ద వ్యవస్థగా ఉందని, దీనిలో సీమెన్స్ అనేది చిన్న విభాగం మాత్రమేనన్నారు. సీమెన్స్‌ప్రాజెక్టు ప్రారంభం నుంచి పనిచేయని, పనికిరాని కొన్ని పరికరాలు ఇక్కడ ఉండటం గుర్తించామన్నారు. ఈ పరికరాల వివరాలు గతంలో పనిచేసిన ఎయు అధికారులకే తెలుస్తాయన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

తాగునీటికి కటకట

ఆరునెలలుగా మరమ్మతులకు గురైన బోరు
అలంకారప్రాయంగా కుళాయిలు
అవస్థలు పడుతున్న గొర్లివారి కల్లాల ప్రజలు

పాడైన బోరుబావి, పక్కనే నీరివ్వని కుళాయి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పంచాయతీ గొర్లివారి కల్లాలలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 1కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామంలో మంచినీటి బోరు, కుళాయి ఏర్పాటు చేసినప్పటికీ, అవి పనిచేయకపోవడంతో ప్రజలు నీటికి కటకటలాడక తప్పడం లేదు. మంచినీటి బోరు ఆరునెలలుగా పాడైపోయి, కుళాయిలు ఉన్నా నెలల తరబడి నీటి సరఫరా లేని పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో సమీప పొలాల్లోని బోరు నుంచి ఉప్పునీటికి తెచ్చుకుని, తాగునీటితోపాటు ఇతర అవసరాలను తీర్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు గొర్ల శ్రీను, మీసాల శ్రీనివాసు తదితరులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమ గ్రామంలో ఉన్న మంచినీటిబోరును మరమ్మతులు చేయడంతోపాటు కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

చిరుప్రాయంలోనే ఆర్యన్‌కు 'నోబెల్'

అవార్డు గ్రహీతకు పలువురి అభినందన

ఆర్యన్‌కు మెమొంటో బహూకరించి అభినందిస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి- పెందుర్తి : 14నెలల చిరుప్రాయంలోనే అద్భుతమైన జ్ఞాపకశక్తి, మేధస్సుతో అందరినీ అబ్బురపరిచి, నోబెల్ వరల్డ్ రికార్డు, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న బుడతడిపై ప్రశంసలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.
గ్రేటర్ విశాఖ, 95వ వార్డు పాపయ్యరాజుపాలెం వివేకానంద విహార్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న గాబు కల్యాణ్‌కుమార్, రాగ ప్రియాంకల కుమారుడు గాబు చార్విక్ ఆర్యన్.అతి చిన్న వయస్సు (14 నెలలు)లోనే ఆన్‌లైన్ రికార్డ్ ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాడు, వివిధ రకాల కేటగిరీలలో జంతువులు, పక్షులు, వాహనాలు, పండ్లు, పువ్వులు, కూరగాయలు, రంగులు, వర్ణమాలలు, సంఖ్యలు, గృహోపకరణాలు, బొమ్మలు, 350 ఫ్లాష్ కార్డ్‌లను, కొన్ని జంతువులు శబ్దాలు, , స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను అలవోకగా చెప్పేస్తున్న ఆర్యన్ ప్రతిభను వీడియో రికార్డింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డుల పరిశీలనకు పంపారు. ఆన్‌లైన్‌లోనే ఆర్యన్ ప్రతిభను పరిశీలించిన మీదట ఈ నెల 13న చార్విక్ ఆర్యన్‌కు నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్‌ను ప్రకటించారు.
నోబెల్, ఇండియా వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న చార్విక్ ఆర్యన్‌ను స్థానిక వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దుశ్శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఆర్యన్‌లోని ప్రతిభను గుర్తించి, అతనికి తర్ఫీదునిచ్చిన తల్లిదండ్రులను కూడా అభినందించారు.

జూడోలో అవినాష్ ప్రతిభ

పిల్లి అవినాష్

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం గోస్తని విద్యాపీఠ్ హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి పిల్లి అవినాష్ అంతరాష్ట్ర జూడో పోటీలకు ఎంపికయ్యారని గోస్తనీ విద్యాపీఠం అధినేత కాళ్ల వరలక్ష్మీ గురువారం తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.పైడిరాజు శిక్షణలో జూడోలో మెళకువలు నేర్చుకుని తర్ఫీదు పొందిన అవినాష్, అండర్-14 విభాగంలో మంచి ప్రతిభను కనబరిచి తమ పాఠశాలకు మంచిపేరు తెచ్చారని వరలక్ష్మీ తెలిపారు. అవినాష్ తండ్రి పిల్లి ఆదినారాయణ ఒక సాధారణ ఆటో డ్రైవర్ కాగా తల్లి అప్పల రమణమ్మ గృహిణి. రాష్ట్రస్థాయి క్రీడలకు తమ కుమారుడు అవినాష్ ఎంపికపై అవినాష్ తండ్రి ఆదినారాయణ హర్షం వ్యక్తం చేస్తూ, తమ బిడ్డకు తర్ఫీదునిచ్చి, ప్రోత్సాహించిన పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపాడు.

వ్యాయామ పరికరాలకు మరమ్మతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ వద్ద ఉన్న ఓపెన్ జిమ్‌లో కొన్ని వ్యాయామ పరికరాలకు సంబంధిత విభాగం జివిఎంసి అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు. అవసరమైన చోట కొత్తవి అమర్చారు

మరమ్మతులు చేస్తున్న జివిఎంసి సిబ్బంది

ఘనంగా సందీప్ పుట్టినరోజు వేడుకలు

సందీప్ జన్మదిన వేడుకలలో మాట్లాడుతున్న పంచకర్ల

ప్రజాశక్తి- ఆనందపురం: భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల జన్మదిన వేడుకలు మండలంలోని పెద్దిపాలెం కింగ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జనసేన ముఖ్యనేత పంచకర్ల రమేష్‌బాబుతోపాటు నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనగా, సందీప్ కేక్ కట్‌చేశారు. అతనికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ పంచకర్ల మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపడానికి పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్నానన్నారు. భీమిలి నియోజకవర్గంలో టిడిపి మద్దతుతో జనసేన పోటీలో ఉండడమే కాకుండా తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలన్నారు.. పదవులతో సంబంధం లేకుండా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాకరి శ్రీనుబాబు, చంద్రరావు, పార్టీ మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, నియోజకవర్గ సమన్వయకర్త నాగోతు నరసింహనాయుడు, మజ్జి శ్రీను, జనరల్ సెక్రెటరీ మూర్తి, ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ, గొలగాని బాలు, కార్యదర్శులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, బోద్దాపు గోవిందు, తాడివాడ ప్రశాంత్ కుమార్, బంగారు నాయుడు, నర్సింగరావు, తదితర కమిటీ సభ్యులు, నాయకులు, మహిళలు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ గురువారంతో ముగిసింది. సైన్ బ్లూస్ టీమ్ జెర్రిపోతుల సురేష్ గౌడ్, మనోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో జిల్లావ్యాప్తంగా ఉన్న 40టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన గాజువాక జట్టుకు రూ.20వేలు నగదు బహుమతిని, అలాగే రన్నరప్ సీతానగరం స్టార్స్ జట్టుకు రూ. 12వేలు ప్రైజ్‌మనీని, మూడో స్థానంలో నిలిచిన యారాడ యాదవ స్టార్స్ జట్టుకు రూ. 8వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్, పల్లా చిన్నతల్లి, మాడుపూరు పరదేశి, నక్క వెంకటరమణ, జెర్రిపోతుల గోవిందరావు, ఎండీ గౌస్, రోజారాణి, గొందేశి వెంకటరమణారెడ్డి, అండిబోయిన లక్ష్మి, మంత్రి మంజుల, గురుశు రామలక్ష్మి, ఏకుల వెంకటేష్ గౌడ్, గేదెల మధుసూదన్ రెడ్డి, గొందె శ్రీనివాసరెడ్డి, ములకలపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

'నిజం గెలవాలి'కి సంఘీభావం

భువనేశ్వరికి సంఘీభావం తెలుపుతున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా, అతని భార్య భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్రకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నేతలు సంఘీభావం తెలిపారు. గురువారం తన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ చంద్రబాబు ఎటువంటి తప్పు చేయలేదని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఆయనను జైలులో పెట్టారన్నారు. ఈ సందర్భంగా 'సైకో పోవాలి సైకిల్ రావాలి' అని నినాదాలు చేస్తూ టిడిపి నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నేతలు నారపిన్ని సత్తిరాజు, నందవరపు సోములు, సనపల వరప్రసాద్, బోడేటి విజయ్, కుట్ట కార్తీక్, పెంటకోట అజయ్, నరవ అనూష, కనకకుమార్, దాడి సురేష్, బత్తుల శ్రీను, మేరీ కొండ, బొత్స శ్రీను, బిందు పాల్గొన్నారు.

ఘనంగా దేవన్‌రెడ్డి జన్మదిన వేడుక

దేవన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి- గాజువాక: గాజువాక నియోజవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దేవన్‌రెడ్డికి గాజువాక నియోజవర్గ పరిధిలోని వైసిపి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలతోపాటు పలువురు అధికారులు, వర్తకసంఘం నేతలు, అభిమానులు తరలివచ్చి పూలదండలు, పుష్పగుచ్ఛాలతో అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కూడా వచ్చి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. గాజువాక ఆటోనగర్‌లోని వివిధ పరిశ్రమ యజమానులు కూడా పాల్గొని దేవన్‌రెడ్డికి జన్మదిన వేడుకలు తెలిపారు.

గోతులు పూడ్చివేత

మెయిన్‌రోడ్డులో గోతులు పూడ్చివేసే పనుల్లో ట్రాఫిక్ ఎస్ఐ

ప్రజాశక్తి- ములగాడ : రహదారి గోతులే రోడ్డు ప్రమాదాలకు కారణమని గుర్తించిన మల్కాపురం పోలీసులు వాటిని పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు పర్యవేక్షణలో మల్కాపురం ప్రధాన రహదారిలో ఉన్న గోతులను సిమెంట్ కాంక్రీటుతో పూడ్చే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామికప్రాంతంలో ప్రధాన రహదారంతా గోతులమయంగా ఉందని, ప్రమాదాల నియంత్రణకు గోతులు పూడ్చే పనులు పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో మల్కాపురం ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఇఇ రత్నాకర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసరాజు గురువారం పరిశీలించారని ఎఇఇ నీహారిక తెలిపారు. 'అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించి, సంబంధిత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారని, కాంట్రాక్టర్‌ను పిలిచి తగు సూచనలు చేశారని ఎఇఇ నీహారిక తెలిపారు.

చీరల పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : దసరా సంబరాల్లో భాగంగా జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ఆర్థిక సాయంతో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. వార్డు పరిధిలోని ఆర్‌పిలు, పొదుపుసంఘాల మహిళలకు వైసిపి వార్డు అధ్యక్షులు అయితంశెట్టి గోపి, పిఎసిఎస్ ఛైర్మన్ ఆళ్ల పైడిరాజు చీరలను అందజేశారు.ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ, దసరా, దీపావళి కానుకగా వార్డులోని మహిళలకు ఆడారి ఆనంద్‌కుమార్ సమకూర్చిన చీరలను అందజేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ఆనందకుమార్ లాంటి మంచి వ్యక్తినే ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు షేక్ రమణ, దాడి ఆదిబాబు, వాలంటీర్లు, ఆర్‌పిలు పాల్గొన్నారు

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పారావు, అప్పలరాజు

నీరులేక ఎండిపోతున్న వరి పంటను పరిశీలించి మాట్లాడుతున్న రైతు నేతలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షాభావ కారణంగా నీరు లేక ఎండిపోయిన వరి పొలాలను గురువారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోనే వ్యవసాయానికి కేంద్రబిందువైన మునగపాకలో ఇంతటి కరువు దుర్భిక్ష పరిస్థితులు ఉంటే జిల్లా మొత్తం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. అనకాపల్లి జిల్లాలో వరి నాట్లు 60శాతం జరగ్గా, 16 మండలాలలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పుడు వరి పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. ఎకరాకు రూ.30 వేలు నుండి రూ.40 వేలు ఖర్చుపెట్టారని, రైతులకు పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 30 టన్నులు వచ్చే చెరకు పంట, వర్షాభావం కారణంగా మూడు, నాలుగు టన్నులకు పడిపోయిందన్నారు. జిల్లాలో ఏడుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారిలో ఇద్దరు మంత్రులు ఉన్నా కరువుపై స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ రైతులు వేగి సూరిబాబు, భీశెట్టి సన్యాసినాయుడు, పి రమణ, వేగి శివ, భీశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు మండలంలో మల్లవరం, జగన్నాధపురం, తిమ్మరాజుపేట, పెదపాడు, కాజీ పాలెం గ్రామాల్లోని పంట పొలాలను గురువారం రైతు ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు. వర్షాభావం కారణంగా వరి పంటలకు తెగుళ్ల సోకాయని, చెరుకు తోటలు ఎదుగుదల దెబ్బతిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ భీమిశెట్టి రాము, కాండ్రేగుల తవుడుబాబు, సిఐటియు నాయకులు కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన తెలుగు రైతు నేతలు

కశింకోట : అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతుని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కసింకోట మండలం అచ్యుతాపురం గ్రామంలో వరిపంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రోయిన్ల మరమ్మతులు చేయకపోవడం వల్ల శారదా నది నీరు వృథాగా పోతుందన్నారు. జిల్లాలో వర్షాభావం, సాగు దిగుబడులను దృష్టిలో పెట్టుకొని పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకు నాయుడు, నారిపిల్లి ప్రసాద్, బల్ల అప్పలకొండ, తెరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రవి పటాన్ శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాథ్, పచ్చికూర రాము, నంబారి శ్రీను, అక్కిరెడ్డి రమణబాబు, కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న తెలుగు రైతు నాయకులు

డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

వెలుగు సిబ్బంది అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

వెలుగు సిబ్బంది అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ గురువారం స్థానిక డిఆర్డిఏ కార్యాలయం వద్ద సిపిఎం మండల కన్వీనర్ గంట శ్రీరామ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంట శ్రీరామ్ మాట్లాడుతూ సత్యనారాయణపురం గ్రామం శ్రీ వెంకట సాయి ఎస్‌హెచ్‌జి గ్రూప్ పేరుతో మహిళలతో బోగస్ గ్రూప్ ఏర్పాటు చేసి బ్యాంకు ఆఫ్ ఇండియాలో రూ.15,00,000 లోన్ చేసి వెలుగు సిబ్బంది కాజేసి డ్వాక్రా మహిళలను మోసం చేశారని ఆరోపించారు. ఒక్క రూపాయి కూడా డ్వాక్రా మహిళలకు రుణాలుగా ఇవ్వలేదన్నారు. దీనిపై వెంటనే అదికారులు దర్యాప్తు చేసి మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పుర్రె లక్ష్మి పేరుతో ఇదేవిధంగా ముద్ర రుణాలు రూ.50వేలు కాజేశారన్నారు. అనేకమందికి ముద్రా రుణాలు రూ.15 లక్షల చొప్పున 6 గ్రూపుల వరకు సుమారు కోటి 20 లక్షలు రూపాయలు వరకు వెలుగు సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. దీనిలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపమాక నాగలక్ష్మి, నందికి రాణి, నందికి నాగమణి, ఆకుల దుర్గ, బోడి ఝాన్సీ, పుర్రె లక్ష్మి, పెదపూడి సుత్తి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.36 లక్షలు

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి 36 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధిలో భాగంగా సర్వశిక్షా అభియాన్ అధికారులు కాంపౌండ్ గోడ నిర్మించనున్నారు. ఖేలో ఇండియా, రాష్ట్ర క్రీడా మంత్రిత్వ శాఖ సమన్వయంతో మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో ఈ క్రీడా మైదానాన్ని, ఎన్టీఆర్ గ్రౌండ్‌ను వివిధ రకాల క్రీడలకు అనుకూలంగా తీర్చి దిద్దనున్నట్లు ఎంపీ సత్యవతి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 16 నుంచి 19 తేదీ వరకు ఢిల్లీలో జరిగిన అఖిలభారత సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో ఎపి రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఖోఖో టీంకు నాయకత్వం వహించిన అనకాపల్లి జిల్లాకు చెందిన దాడి శ్యాం ప్రసాద్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో టీము ద్వితీయ స్థానం సాధించింది. ప్రస్తుతం దాడి శ్యాంప్రసాద్ అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా దాడి శ్యాంప్రసాద్‌కు డైట్ కళాశాల అధినేత దాడి రత్నాకర్, విశాఖపట్నం జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు దాడి జైవీర్, విశాఖ జిల్లా సభ్యులు అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు అభినందనలు తెలియజేశారు.

విలేజ్ క్లినిక్, ఆర్‌కెబి భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం గ్రామంలో విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవనాలను స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండ రాంబాబు, స్థానిక సర్పంచి ముచ్చకర్ల శ్రీను, తహసీల్దార్ వెంకటేశ్వరరావు , పిహెచ్సి వైద్యాధికారిణి సంధ్యారాణి, మండల నాయకులు దాకారపు నాగరాజు, స్థానిక ఎంపీటీసీ మరిసా పెద రమణ పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి

గొల్లవిల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి గౌరవ చైర్మన్‌గా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యవహరించనున్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కరక సోము నాయుడు, కమిటీ సభ్యులుగా నేటిపల్లి లక్ష్మి, మర్రిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూక రత్నం, దాడి తులసికుమారి, బొడ్డు జయ, కటారి దుర్గ, తెరపల్లి లక్ష్మీ, దాడి కుమార వరాహ కృష్ణ, కొలపర్తి వెంకటనృసింహేశ్వర కన్నబాబు, గుండ రమేష్ గుప్తా, గొంతిని శివ నియమితులయ్యారు. ఇంకా ఈ కమిటీలో కసింకోట మండలం నర్సింగబిల్లి పీఏసీఎస్ అధ్యక్షులు, అనకాపల్లి జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ రవి కిరణ్, అనకాపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీవీఎంసీ మేయర్ సభ్యులుగా వ్యవహరించనున్నారు.

వరిలో చీడపీడల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : వరి పొలాలలో చీడపీడల నివారణకు, ముఖ్యంగా సుడి దోమ, ఆకు ముడత పురుగు ఉధృతిని రైతులు నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని వారాడ, యడ్లవానిపాలెం, ఎ.కోడూరు గ్రామాలలో గురువారం ఆయన పర్యటించి రైతులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల వలన సుడి దోమ, ఆకు ముడత పురుగు వరి పొలాలలో ఎక్కువగా ఉందన్నారు. సుడి దోమ నివారణకు పైమెట్రిజోల్ అనే మందును ఎకరానికి 120 నుంచి 160 గ్రాముల వరకు వాడవచ్చని తెలిపారు. ఆకు ముడతకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం స్పెషల్ పొడి మందును ఎకరానికి 500 గ్రాములు లేదా ఎసిఫేట్ అనే మందును 500 గ్రాములు కానీ పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు లెక్కల ముత్యాల నాయుడు, యడ్ల వెంకి నాయుడు, పాటూరు వెంకటరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పూజిత, విజయ్ పాల్గొన్నారు.

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ, జెవివి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 10వ తేదీ నుండి 2024 జనవరి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను గురువారం అనకాపల్లిలో జరిగిన మండల విద్యాధికారుల సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ని పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక అనేక సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందన్నారు. సంబరాలు నిర్వహణ కోసం రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. చెకుముకి సంబరాలు జయప్రదంగా నిర్వహించేలా ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, సహకరించాలని ఆయన కోరారు. చెకుముకి సైన్స్ సంబరాలు సందర్భంగా నవంబరు 10వ తేదీన పాఠశాల స్థాయిలోనూ, నవంబర్ 30న మండల స్థాయిలోనూ, డిసెంబరు 17న జిల్లా స్థాయిలోనూ, 2024 జనవరి 27, 28 తేదీలలో రాష్ట్రస్థాయిలోనూ సైన్స్ ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీలలో 8, 9 ,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా కోశాధికారి బి.ఉమామహేశ్వరరావు, జిల్లాలోని ఎంఇఒలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

శ్రీదేవి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విధి నిర్వహణలో భాగంగా వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లి కేజీబీవీలో పనిచేస్తున్న సైన్స్ విభాగ టీచర్ బండారు శ్రీదేవి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విధి నిర్వహణలో భాగంగా ఆన్లైన్ రిపోర్టులు తీసుకురావడం కోసం బయటికి వెళ్లి ఇసుక ట్రాక్టర్ ప్రమాదంలో శ్రీదేవి అక్కడికక్కడే మతి చెందారు. శ్రీదేవి మతికి ఫెడరేషన్ నాయకులు సిఐటియు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశాయి. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఉన్న ఆమె భౌతిక కాయాన్ని ఫెడరేషన్ జిల్లా చైర్మన్ పివి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ టీచర్లకు కానీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అకాల మరణం చెందిన, ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆ కుటుంబాల రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పర్మినెంట్ చేస్తానన్న ప్రభుత్వ హామీ నెరవేరక, మినిమం టైమ్స్ స్కేల్ అమలు కాక అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న వీరికి ప్రభుత్వం ఎటువంటి సహాయ సహకారాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రమాదాల గురైన మరణించిన కుటుంబాలనూ పట్టించుకోవడం లేదన్నారు. శ్రీదేవి కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సత్యనారాయణ స్వామి ఆలయ భూమికి రీ సర్వే

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం భూమికి రీ సర్వే నిర్వహించారు. దేవస్థానం 1 ఎకరా 32 సెంట్లు విస్తీర్ణంలో కొలువుతీరి ఉంది. సుమారు 25 ఏళ్ల క్రితం ఈ ఆలయ స్థలానికి సర్వే జరిపి ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేశారు. ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు మండల తహశీల్దార్ కార్యాలయం సర్వేయర్ ద్వారా మళ్లీ రీ సర్వే జరిపించగా ఆలయ గోడ పక్కన ఆనుకొని కొంత స్థలం దేవాలయానికి సంబంధించిన భూమి ఉందని అధికారులు గుర్తించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాల మేరకు గురువారం ఆలయ భూమికి మళ్లీ పక్క భూముల యజమానుల సమక్షంలో రీ సర్వే జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కెఎం నాయుడు, ఈవో ఆదినారాయణ మాట్లాడుతూ హద్దుల నిర్ణయం తర్వాత ఆలయ ప్రస్తుత గోడను తొలగించి మళ్లీ నూతనంగా ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు. రీ సర్వే కార్యక్రమంలో మండల సర్వేయర్ పి. మోహన్ రావు, త్రినాధ్, ఆలయ ధర్మకర్తలు తాడి కోటేశ్వరరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు, ఎక్స్ అఫిషియో సభ్యుడు విద్యాసాగర్, దేవాలయ సిబ్బంది మళ్ల గణేష్, కాండ్రేగుల రామారావు, గుమస్తా శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్టుల బహూకరణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.స్వర్ణలత, గతంలో ఇక్కడ ఇంగ్లీష్ ఉపాధ్యాయినిగా పనిచేసిన జి.సంధ్యారాణి కలిసి 12 స్పోర్ట్స్ టీ షర్ట్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు ఆటలలో రాణించాలని కోరారు. విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్ట్స్ బహూకరించిన హెచ్ఎంని, సంధ్యారాణిని సర్పంచ్ చింతల వెంకట రమణ, గ్రామ పెద్దలు అభినందించారు.

వాకర్స్ సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : వాకర్స్ క్లబ్ వాకర్స్ సంక్షేమం కోసం కృషి చేయాలని వాకర్ జిల్లా గవర్నర్ యు.శుభ అన్నారు. గురువారం చోడవరం వాకర్స్ క్లబ్‌లో జరిగిన వాకర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు ఎదుర్కొని వృద్ధాప్యానికి చేరుకుంటారని, వారి శేష జీవితం ఆనందంగా గడవాలంటే నిత్యం శారీరక మానసిక వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం శుభ భవనం రెండో స్లాబ్ నిర్మాణానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. విశాఖ నుంచి వచ్చిన నలుగురు సభ్యురాలను సన్మానించారు. ఒరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ షాపింగ్ మాల్ అధినేత పిఎస్‌కె. గుప్త, దేవానంద్, కోశా రాంబాబు, రాయవరపు కన్నం నాయుడు, జాజుల జగ్గారావు, తటవర్తి సూర్యనారాయణ, టి.వి.రమణ, కె. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గోతుల రోడ్డులో విరిగిన ఆటో చక్రం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పెదమదీన జంక్షన్ నుండి గున్నెంపూడి వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులలో భాగంగా జెసిబితో తవ్వించి విడిచిపెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రావికమతం మండలంలోని పిల్లవానిపాలెం, గున్నెంపూడి తదితర గ్రామాల నుండి బుచ్చయ్యపేట బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌కు రైతుల నుండి సేకరించిన పాలను రవాణా చేస్తుంటారు. గురువారం ఉదయం ఆటో డ్రైవర్ దూది రమణ పాలు తీసుకొస్తుండగా, గోతుల వల్ల పెద్దమదీన వద్ద ఆటో నడుస్తుండగా ఒక్కసారిగా దాని చక్రం విరిగి ఊడిపడింది. రెండు నెలల క్రితం తారు రోడ్డు వేయడానికి సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డును జెసిబితో తవ్వించడంతో పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. ఇటీవల జనసేన పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన చేసినా సంబంధిత అధికారులు కానీ కాంట్రాక్టర్లు గానీ పట్టించుకోలేదు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

గుంతలో పడ్డ ద్విచక్ర వాహనదారుడు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం -వడ్డాది మెయిన్ రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో కల్వర్టుల వద్ద గొట్టాలు ఏర్పాటు చేయడానికి గుంతలు తవ్వగా, వాట్లో ద్విచక్ర వాహనదారులు పడుతున్నారు. ఆ గుంతల వల్ల సదరు కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో బుధవారం రాత్రి బైక్‌తో ఒక వ్యక్తి గోతిలో పడ్డాడు. అతడిని స్థానికులు విశాఖ ఆసుపత్రికి తరలించారు. మెయిన్ రోడ్‌లో గుంతల వలన పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ నేత అప్పలరాజు డిమాండ్ చేశారు.

శత శాతం జిఇఆర్ సాధించే దిశగా కృషి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

5 సం. నుండి 18 సం.ల బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ ఎక్కడైనా బడిలోనే చదువుతూ ఉండాలని, విద్యార్థులకు సంబంధించిన గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జిఈఆర్)(స్థూల నమోదు నిష్పత్తి) శత శాతంగా ఉండేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బడి బయట ఉన్న 2141 విద్యార్థులు నవంబర్ 10వ తేదీ నాటికి బడిలో లేదా ఓపెన్ స్కూల్‌లో జాయిన్ చేయాలని, చదువుపై ఆసక్తి లేని వారిని వృత్తి విద్య శిక్షణలో చేర్పించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్ నమోదు కాని 11560 విద్యార్థుల వివరాలు నవంబర్ 10వ తేదీ లోపల ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. నవంబర్ 3వ తేదీన ఆంగ్ల మాధ్యమంలో జరిగే ఎస్ఐఏఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన తరగతులు, వీలైనన్ని ఎక్కువ మాక్ టెస్ట్స్ నిర్వహించాలని ఎంఈఓలను ఆదేశించారు. టిఎఆర్ఎల్, ఎల్ఐపి, డిజిటల్ తరగతులు, డిజిటల్ మధ్యమాల వినియోగంపై కచ్చితమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు రేమెడియల్ తరగతులు నిర్వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డివైఈవో సుజాత, ఎ.డి(స్కీమ్స్) రవిబాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి చాముండేశ్వర రావు, జిల్లాలోని ఎంఈఓలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన 'పోలీసు ఓపెన్ హౌస్'

ప్రజాశక్తి-అనకాపల్లి

పోలీసు విధులు, పరికరాల పని తీరు వివరిస్తున్న ఎస్పి

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్పీ కెవి.మురళీకృష్ణ ప్రారంభించారు. విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే వివిధ పరికరాలు, నేరస్తులను పట్టుకోవడంలో జాగిలాల పనితనం, క్రైమ్ కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ వినియోగం, మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలను కనిపెట్టడం, బాంబు డిస్పోజల్ పరికరాలు, నేరదర్యాప్తు విధానం తదితర విషయాలపై విద్యార్థులకు ఎస్పి మురళీకృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్బి ఇన్‌స్పెక్టర్‌లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పోలీసు కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్ఓ మోహనరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, కమ్యూనికేషనల్ ఇన్‌స్పెక్టర్ వెంకటచిట్టి, ఎస్సైలు శేఖరం, సింహాచలం, ఆదినారాయణ, భవానివరప్రసాదరావు, ఢిల్లేశ్వరరావు, జీవీఎంసీ గర్ల్స్ హైస్కూల్, జీవీఎంసీ మెయిన్ స్కూల్, నారాయణ, భాష్యం, సర్వేపల్లి జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగిస్తున్న వివిధ ఆయుధాలను, అలాగే పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను విద్యార్థులకు చూపించి, వాటి పనితీరుపై అవగాహన కలిగేలా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

దేవరాపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కెజిబివి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డి.నాగేంద్ర మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ, సామాజిక పాత్ర అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

చోడవరం : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చోడవరం పోలీసుల ఆధ్వర్యంలో డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు స్థానిక ఎస్సై సూర్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'క్రెబ్స్' ఎదుట కొత్తపల్లి గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి- కశింకోట

క్రెబ్స్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

కశింకోట మండలం కొత్తపల్లి వద్ద గల క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ ఎదుట బుధవారం రాత్రి నుండి గురువారం వరకు స్థానికులు ధర్నా నిర్వహించారు. క్రెబ్స్ వల్ల గ్రామంలో భూగర్భ జలాలు కలుషితమైనట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో బోరుబావులు తీసుకుంటే కలుషిత నీరు వస్తుందన్నారు. కంపెనీ విడుదల చేసే రసాయనాల వల్ల కొంతకాలంగా చుట్టుపక్కల గ్రామాల్లో దుర్వాసన వస్తుందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారికి ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం కూడా సమస్య పరిష్కారిస్తున్నామని చెబుతున్నా సుమారు 20 సంవత్సరాల నుండి పరిష్కారం చేయకుండా ఇబ్బందులు గురి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆవాల అప్పారావు, 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

జలాశయంలో మృతదేహాన్ని తీస్తున్న గజఈతగాళ్లు

జలాశయంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంలో గల్లంతైన రొంగలి సత్తిబాబు (38) మృతదేహం గురువారం లభ్యమైంది. సబ్బవరం మండలం బలిజిపాలెం గ్రామానికి చెందిన సత్తిబాబు కళాసిగా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో విహారయాత్రకు బుధవారం జలాశయానికి వచ్చి బోటు ప్రమాదంలో గల్లంతయ్యాడు. అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై డి. నాగేంద్ర గురువారం ఉదయం గజ ఈతగాలతో గాలింపు చర్యలు చేపట్టగా సత్తిబాబు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

జీతాల కోసం ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఎదురుచూపు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు 512 మందికి మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్ట్ టైం ఉద్యోగులుగా పని చేస్తున్న సిఆర్పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్ టైం శిక్షకులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఎంఈఎస్ మెసెంజర్లు జీవితాలతో విద్యాశాఖ అధికారులు జిల్లా మంత్రులు ఆటలాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మూడు వాయిదాల డిఏ ఏరియర్స్ 20.02 నుండి 22.75 శాతం ఎరియర్స్ సెప్టెంబర్ నెలలో వేయవలసిన మొదట విడత సొమ్మును అక్టోబర్ నెల గడుస్తున్నా వెయ్యకపోవడం శోచనీయమన్నారు.

పాడి రైతులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కశింకోట : జగనన్న పాల వెల్లువలో భాగంగా అమూల్ డెయిరీకి పాలుపోసిన రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహం అందించినట్లు నరిశింగబిల్లి పశు వైద్య అధికారి డాక్టర్ చైతన్యమణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ అమూల్ సహకార సంఘం పాడి రైతులు బ్యాంక్ అకౌంట్లలో 1 లీటరుకు 50 పైసలు వంతున నేరుగా విడుదల చేసినట్లు తెలిపారు. రూట్ 13లో, చింతలపాలెం, గొబ్బూరు, తిప్పురవాని పాలెం గ్రామాలలో 94 మంది రైతులకు సుమారు రూ 1,01,850, రూట్ 10లో కన్నూరు పాలెం, లాలం కొత్తూరు, జి.భీమవరం, సింగవరం గ్రామాలలో 162 మంది రైతులకు రూ2,78,113 కానుకగా విడుదల చేసిందన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కెడి.పాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు ప్రారంభించారు. 42 పశువులకు డి వార్మింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు పోసిన రైతులందరికీ ఉచితంగా మందులు వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగ అప్పారావు, మేనేజర్ కూండ్రపు శేషు తదితరులు పాల్గొన్నారు.

9న అనకాపల్లిలో బహిరంగ సభ

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా 26వ తేదీ నుంచి ప్రారంభమైన తొలి విడత సామాజిక న్యాయ బస్సు యాత్ర నవంబర్ 9వ తేదీన అనకాపల్లి నియోజకవర్గంలో ముగియనుందని, ఆ రోజు అనకాపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. ఆ బహిరంగ సభ వచ్చే ఎన్నికలకు శంఖారావం కావాలని, ఇక్కడి నుంచే వైసిపి తొలి విజయం నమోదు చేయాలని కోరారు. అనకాపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ నాటికి 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. నవంబర్ 9వ తేదీన అనకాపల్లిలో జరిగే సభ గడిచిన సభ లన్నిటికన్నా విజయవంతం కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దంతులూరి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని..

ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - మాడుగుల: నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలని మండలంలో శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు కార్లే భవాని, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటం నరసింహమూర్తి పాల్గొని మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న నాన్ షెడ్యూల్ ఆదివాసి గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్లో చేర్చాలని గ్రామ సభలో పెట్టి తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతంలో లేనందున అక్కడ నివసిస్తున్న ఆదివాసీల భూములకు, అడవులకు రక్షణ లేదన్నారు. గిరిజనేతరులు, పెత్తందారులు, మైనింగ్ మాఫియా మధ్య ఆదివాసీలు నలిగి పోతున్నారని తెలిపారు. ఐటీడీఏ పథకాలు, నిధులు అందలేదన్నారు.ఆదివాసి గ్రామాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మంచినీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో లేక బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నాన్ షెడ్యూల్ ఆదివాసి గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కుల సమస్యల పరిష్కారం కోసం గిరిజనులంతా కలిసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. భారతదేశంలో ఆదివాసీల హక్కులపై దాడులు జరుగుతున్నాయని వాటిని తిప్పికొట్టేందుకు ఆదివాసీలు ఐక్యం కావలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొర్ర దేవదాసు, కొర్ర నాగార్జున, మువ్వల బాలకృష్ణ, కొర్ర విజయశాంతి, మువ్వల పాలమ్మ, కొర్ర చిన్నారావు గిరిజనులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి: టిడిపి

ప్రజాశక్తి-యస్.రాయవరం:టీడీపీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధపడాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అబద్ధం మాట్లాడుతూ, రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడిన నేపథ్యంలో ఏ క్షణంలోనైనా జరగవచ్చునని, ప్రతి ఒక్క కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి బూత్ ఇన్‌చార్జీలు, గ్రామశాఖ అధ్యక్షులు, సమన్వయ కర్తలు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, మండల స్థాయి నాయకులు, గ్రామస్థాయి నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని ధర్మవరం-అగ్రహారం శ్రీ తులసీ కళ్యాణ మండపంలో 2001-2002 ధర్మవరం-అగ్రహారం హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగినట్లు గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత తమ స్నేహితులు ఒకరినొకరు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్ గా శ్రీపాదుల నాగేశ్వరరావు(ఆర్మీ)వ్యవహరించారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని పోతంగి పంచాయతీ తోటవలస గ్రామంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిరుపేద గిరిజనులకు ఉచితంగా నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద గిరిజనులు కొన్ని సందర్భాల్లో నిత్యావసర సరుకుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ఎంతో కొంత సేవలందించాలన్న ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడు తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.నగేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

-పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మాడుగులలో మందులు ఇస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ రెడ్డి వరహాలు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు వైద్య శిబిరాన్ని, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషకాహార స్టాల్స్‌ను సందర్శించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వీసం కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు,గొడిచెర్ల పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జి పాపారావు,వైసిపి నాయకులు శివ,బాబ్జి, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు

కోటవురట్ల:ప్రజారోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక సర్పంచ్ పావని అన్నారు. గురువారం ఎండపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సుమారు 257 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఉప సర్పంచ్ నానిబాబు, గ్రామ కార్యదర్శి నరసింహ, వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాడుగుల:మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. మాడుగుల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్ పీవీ రత్నం, సర్పంచ్ ఎడ్ల కళావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 556 మంది రోగులకు పరీక్షలు చేయిం చుకున్నట్లు కళావతి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి ఉచిత వైద్యం అందించడానికి ఈ కార్యక్రమం చేపట్టారని సర్పంచ్ అన్నారు. రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచిత మందులను అందించినట్లు ఆమె తెలిపారు. బాలామృతం, చిరుధాన్యాలతో సుమారు 24 రకాల వంటకాలను ఏర్పాటు చేసి వాటి ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీను, వార్డు మెంబర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ వాలంటీర్ల సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లే అనురాధ గురువారం పరిశీలించారు. శిబిరాలలో ఏర్పాటు చేసిన మందులు, అంగన్వాడీ పౌష్టికాహార స్టాల్ను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి నారాయణమూర్తి, నాయకులు ఆదిరెడ్డి వెంకటరావు, ఏటుకూరు రాజేష్, వెంకటరమణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మడుతూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు సందర్శించారు. పౌష్టికాహారం స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి, ఎంపీటీసీ శనివాడ జువాల నాయుడు, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన బుజ్జి, బలిరెడ్డి శ్రీనివాసరావు, గండిబోయిన వెంకట్ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని కోడూరులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్పీ వైస్ చైర్పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి లక్ష్మీ శ్రీనివాస్, ఎంపీటీసీ కోరుకొండ అర్జున అచ్చియ్యమ్మ, వైస్ సర్పంచ్ కోసిరెడ్డి పైడిరాజు, హైస్కూల్ కమిటీ చైర్మన్ వనం ప్రసాద్, అనకాపల్లి సురేష్ పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

సీతమ్మధార : 25వ వార్డు మధురానగర్ ఉన్నత పాఠశాల వద్ద స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, జెసిఎస్ మండల కన్వీనరు మురళీకృష్ణారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సన్నీ, సచివాలయం కన్వీనర్లు కోటి, గోవిందమ్మ, బోనుల జయ, అప్పన్న, గౌరునాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మూడో విడత భూ రీ సర్వే

ప్రజాశక్తి -రావికమతం :మూడో విడత భూముల రీ సర్వే మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తహసిల్దార్ మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూముల రిసర్వేతో రైతులకు ప్రయోజనమన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, చేర్పులు, మార్పులకు రెవెన్యూ కార్యాలయాలకు రాకుండా రైతుల వ్యవసాయ భూముల వద్దకే రెవెన్యూ, సర్వే సిబ్బంది సంయుక్తంగా విచారణ జరిపి భూముల రికార్డు తయారు చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. దీనికోసం రైతులు సహకారాలు అందించాలని ఆయన కోరారు. సాగు భూములకు సంబంధించి యజ మానులు సర్వే సిబ్బందికి పూర్తి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సాగు చేసే భూముల దఖలు పడిన వివరాలు సర్వే సిబ్బందికి ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం మండలంలోని తోటకూరపాలెం, తట్టబంద, గొంప, గుడివాడ, మేడివాడ, కొత్తకోటలో రీ సర్వే కొనసాగుతుందన్నారు. అక్టోబర్ నెల ఆఖరకు మేడివాడ, కొత్తకోట, గొంప గ్రామాల భూములు రి సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని, సర్వే సిబ్బంది కి పూర్తి సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నియోజకవర్గంలో గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న కొనిమి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన సీరం రెడ్డి బాల వెంకట గంగాధర్ కుటుంబీకులకు సీఎం సహాయనిధి నుండి లక్ష 50 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు.బాల వెంకట గంగాధర్ తీవ్ర అనారోగ్యానికి గురవడం తో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర గణేష్ కు విన్నవించుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సహాయం అందేలా చేశారని బాల వెంకట గంగాధర్ తండ్రి వరహాలు తెలిపారు.ఈ సందర్భంగా వరహాలు మాట్లాడుతూ ఎంఎల్ఏ గణేష్, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకట గిరి బాబు, సత్యనారాయణ, సర్పంచులు నాయుడు, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రవణమ్మ

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:వెంకటాపురం గ్రామంలో మహిళపై అత్యాచారయత్నంకు పాల్పడిన నిందితుడిని శిక్షించాలని నర్సీపట్నం జడ్పిటిసీ సభ్యురాలు, పార్లమెంట్ జిల్లా మహిళా సెక్రెటరీ సకల రమణమ్మ కోరారు. గురువారం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించి వెంకటాపురం గ్రామంలో మహిళపై జరిగిన అత్యాచారయత్నం వివరాలు ఎస్సై నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వెంకటాపురం గ్రామంలో వైసీపీ నాయకుడు మహిళపై చేసిన అత్యాచారయత్నం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని, అధికార పార్టీ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 3000 పైచిలుకు ఇటువంటి అత్యాచారాలు జరిగినా సరైన శిక్షలు లేకపోవడంతో నిందితులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మల్లాపురెడ్డి రమాకుమారి, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, ఎంపీటీసీ సభ్యులు పి సూర్యారావు, వార్డు సభ్యులు జానకి హరి, సుంకర బాబ్జి పాల్గొన్నారు.

2 నుంచి జల వనరుల సంరక్షణపై సదస్సులు

- పటిష్ట ఏర్పాట్లు చేయాలి - కలెక్టర్ మల్లికార్జున

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కార మార్గాలు, సాగునీటి కొరత లేని విధానాల రూపకల్పన, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జల వనరుల నిర్వహణ తదితర అంశాలపై విశాఖపట్టణంలోని ర్యాడిసన్ బ్లూ హెూటల్ వేదికగా వచ్చే నెల 2 నుంచి అంతర్జాతీయ సదస్సు జరగనుందని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. మల్లిఖార్జున వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) పేర్లతో స్థానిక ర్యాడిసన్ బ్లూ హెూటల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సంబంధిత కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తూ ఏయే విభాగాల అధికారులు ఏయే చర్యలు చేపట్టాలో సూచనలు చేశారు. సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేశారు.సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 90 దేశాల నుంచి అతిథులు, ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ), ఐఎన్ఐసీడీ (ఇండియన్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ), సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్)ల నుంచి ఉన్నతాధికారులు, సభ్యులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. భద్రతా, నిర్వహణ పరమైన ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సదస్సుకు హాజరయ్యే అతిథుల్లో సుమారు 300 మంది స్థానిక పర్యాటక ప్రాంతాలను, అరకు, తాటిపూడి రిజర్వాయర్లను సందర్శిస్తారని ఇరిగేషన్ ఈఈ ఉమేష్ కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చే వారి వివరాలు, వారి బస వివరాలను పోలీసు శాఖకు ముందుగా తెలియ జేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ. రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఇరిగేషన్ ఈఈ ఉమేశ్ కుమార్, ఆర్డీవోలు, పోలీసు, ఎయిర్ పోర్టు అథారిటీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పందూరు గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్త గూడేపు చిరంజీవిపై వైసీపీ నాయకులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బాధితుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. గ్రామంలో వైసీపీ ప్రధాన నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను పగలు, రాత్రి అని తేడా లేకుండా అక్రమంగా తరలిస్తూ ఉండడంతో జనసేన కార్యకర్త చిరంజీవి ఫోటోలు తీస్తున్నాడు. ఆ సమయంలో గమనించిన వైసీపీ గ్రామ కీలక నాయకులు తనపై దాడి చేశారని తెలిపాడు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు జానకి శ్రీను, సుంకర బాబ్జి, పుప్రేవు సూర్యారావు బాధితుడిని పరామర్శించారు. పందూరు కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, గ్రామంలో అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై విచారణ చేపట్టి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐను కోరారు.

1న జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని,నవంబర్ 1వ తేదీన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించడానికి గాను పలు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నివాళి అర్పిస్తున్న నేతలు

మాజీ ఎమ్మెల్యే దేముడుకు నివాళి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్థానిక బ్యాంక్ కాలనీ వద్ద మాజీ ఎంఎల్ఎ గోడ్డేటి దేముడు 8వ వర్ధంతి పురస్కరించుకొని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. దేముడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, కామ్రేడ్ గొడ్డేటి దేముడు మాజీ శాసనసభ్యులుగా ప్రజా ఆదరణ పొందారన్నారు.క మ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి చివరి క్షణం వరకు నిజాయితీగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లు గురుబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్ రావు, గౌరవాధ్యక్షులు శివలంక కొండలరావు, జోగిరాజు, శ్రీరామ్మూర్తి, ఏ.ఐ.ఎస్.ఎఫ్.అనకాపల్లి జిల్లా కార్యదర్శి, జి.ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్ తిప్పన అప్పలరాజు గురువారం తెల్లవారుజాము సమయంలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం ముగించుకుని మైక్ సెట్‌ను ఉద్దండపురం లో అప్పగించడానికి వస్తుండగా వెనుక నుండి పాల వ్యాన్ ఢీకొంది .ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ అప్పలరాజు గాయపడ్డాడు. స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్సను అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు.

బోల్తా పడ్డ ఆటో

జగనన్న కాలనీకి .. రోడ్డు నిర్మాణం చేపట్టండి

-మోకాళ్లపై ఆదివాసీల వినూత్న నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట: జగనన్న కాలనీ ఇల్లు కట్టుకుంటాం, మాకు రోడ్డు నిర్మాణం చేయాలని రోలుగుంట మండలం లోసింగి గ్రామం జగనన్న లేఅవుట్ల వద్ద ఆదివాసీ కొందు గిరిజన మహిళలు గురువారం మోకాళ్లపై నిల్చొని చేతిలో పట్టా పట్టుకొని వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా రోలుగుంట, రావికమతం మండలాల్లో సరిహద్దు గ్రామాలైన లోసింగి, కొత్తలోసింగి, పిత్రిగడ్డ, పెద్దగరువు సర్వే నెంబర్ 18, 19లో ఒక ఎకరా 13 సెంట్లు 9 లక్షల రూపాయలు పెట్టి భూమిని కొనుగోలు చేసి 50 మంది కొందు ఆదివాసి గిరిజనులకు 2021లో జగనన్న కాలనీ లేఅవుట్ ఏర్పాటు చేసి పట్టాలు ఇచ్చారన్నారు. ఆ గ్రామానికి వైబి.పట్నం నుండి లోసింగి కొండ శిఖర గ్రామం రోడ్డు సౌకర్యం లేక పోవడంతో జగనన్న కాలనీ లేఅవుట్‌ల దగ్గర ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారన్నారు. తప్పులు బలిసి పోవడంతో లేఅవుట్ మొత్తం అడవిగా మారిందన్నారు. రోడ్డు వేస్తే ఇళ్ల నిర్మాణం చేపడతారన్నారు. అనారోగ్యంకు గురైతే డోలి ద్వారానే హాస్పిటల్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రేషన్ బియ్యంకి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్ళవలసిందేనన్నారు. రోలుగుంట మండలం వైబి.పట్నం నుండి లోసింగి మీదిగా రావికమతం మండలం చలిసింగం గ్రామ వరకు 7 ఫార్మేషన్ ఆఫ్ రోడ్డు నిమిత్తం రెండు మండలాల మండల పరిషత్ నుండి 10 లక్షలు మంజూరు చేశారని, ఫార్మేషన్ ఆఫ్ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. 108, భారీ వాహనాలు మాత్రం వెళ్ళలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. నిధులు కేటాయించి రోడ్డు ఏర్పాటు చేయాలని, జిల్లా కలెక్టర్ స్వయంగా కొండశిఖర గ్రామాన్ని సందర్శించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి,పద్మ, కిల్లో ఈశ్వరి, గ్రామ పెద్దలు సత్తిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

చేతులు జోడించి నిరసన చేపడుతున్న ఆదివాసీ మహిళలు

అవకాశం ఇస్తే వైసిపి నుంచి పోటీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అవకాశం లభిస్తే వైసిపి పార్టీ నుండి పోటీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని గిరి జాగృతి అసోసియేషన్ అధ్యక్షులు మోరి సింహాచలం, కోశాధికారి కొరతం ఈశ్వరరావు తెలిపారు. అరుకు లోయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇప్పటివరకు గిరి జాగృతి అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఆర్గనైజేషన్ ద్వారా విద్య, వైద్యం వంటి సేవ కార్యక్రమాలు గిరిజనులకు పలు రూపాలుగా అందించినట్లు చెప్పారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు వారు తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే సేవలను మరింతగా చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వస్తున్నామన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పెదబొడ్డేపల్లి గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వెలుగుల అర్జున్ రావు, మాకిరెడ్డి రామునాయుడు గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాలో వ్యవసాయ కూలీలను, రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావం కారణంగా ఈ సంవత్సరం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.వలసలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వ్యవసాయ పనులు లేక గ్రామాలు ఖాళీ అవుతున్నాయన్నారు.ఇంత తీవ్రమైన కరువు పరిస్థితుల్లోనూ ప్రభుత్వం, అధికారులు అంచనా వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ లో 200 రోజులు పని దినాలు, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లు గురుబాబు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, మాకిరెడ్డి రాజు బాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

1 నుంచి 'జగనే ఎందుకు కావాలంటే'

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో నవంబర్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. 1వ తేదీన చీడిగుమ్మల-1, 2న చీడిగుమ్మల-2, 3న పప్పుశెట్టిపాలెం, 6న జోగుంపేట, 7న గొలుగొండ, 8న కొత్తమల్లంపేట, 9న చోద్యం, 10న లింగంపేట, 13న ఏఎల్‌పురం 1, 14న ఏఎల్‌పురం 2 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం మహిళపై జరిగిన అత్యాచారయత్నం కేసులో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు కె రామసత్యనారాయణపై ఎస్ఐ నారాయణరావు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి గురువారం నర్సీపట్నం కోర్టుకు హాజరు పరిచారు. నిందితుడినికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: విద్యుత్ స్తంభం విరిగి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ దాని స్థానంలో కొత్త స్తంభం వేయకపోవడం పట్ల సర్పంచ్ గోకివాడ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో తట్టబంద గ్రామంలో మొటూరు గోవింద, మోటారు రాజుబాబు తదితరులు ఇంటి వద్ద స్తంభం విరిగి పడిపోవడంతో కరెంటు పూర్తిగా స్తంభించిపోయిందని సర్పంచి గోకివాడ రమణ తెలిపారు. విరిగిన స్తంభం నుంచి పలువురు ఇళ్లకు ఇంటి లైను తీసుకునే వారన్నారు. అది విరిగి పడడంతో ఆ స్తంభానికి ఉన్న లైన్లను వేరే స్తంభం నుంచి తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఐదు టేకు దుంగలను అటవీశాఖ అధికారులు స్వాదీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి తోటలూరు గ్రామం నుండి పాతకేడిపేటకు ఆటోలో అక్రమంగా టేకు దుంగలను తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు కేడిపేట డిఆర్ఓ కెవి.రాజేష్, తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పల్లావూరు శివారు వైఎన్.పాకల జంక్షన్ వద్ద పట్టుకున్నారు.